ఉన్నా ముందు మీరు బాధపడిపోతారు. జాగ్రత్త" అని బెదిరించాడు పేర్రాజు.

"మే మేమీ బాధపడంలే! మా గురించి నీ కెందుకు బెంగ? నువ్వీ సంబంధాని కొప్పుకో! ఈ జన్మకి మమ్మల్నందర్నీ గట్టెక్కించిన వాడి వవుతావు" అన్నారు అమ్మ, నాన్న.

పేర్రాజు మళ్లీ ప్లేటు మార్చి, "అయినా ముక్కూ మొహం తెలియని అమ్మాయిని, ఎప్పుడూ పరిచయం లేని అమ్మాయిని నేనెలా చేసుకుంటాను? ముందు ఒకరి నొకరం అర్థం చేసుకోవాలి గదా?" అన్నాడు.

"ఇప్పు డెవరు కాదన్నారు? పెళ్లి పరిచయం చేసుకో. నీ కున్న సందేహాలన్నీ ఆ అమ్మాయి నడుగు. నువ్వు చేసుకోవాలనుకున్న అర్థమంతా చేసుకో. నిన్నెవరూ అడ్డు పెట్టరు" అన్నాడు నాన్న.

"నాన్నా! ప్రేమించటం అన్నది దైవికంగా జరగాలి గాని, ఇలా ఏర్పాటు చేసుకుంటే అందులో 'ప్రేమ' అన్న మూలపదార్థమే లోపిస్తుంది! చాలా కృతకంగా ఉంటుంది!" అన్నాడు పేర్రాజు.

"వెధవ భాషా, నువ్వూను! అసలు నిన్ను కాలేజీకి పంపటమే బుద్ధి తక్కువైంది" అన్నాడు నాన్న.

"నాయనా! రాక రాక మంచి సంబంధం కష్టపడకుండా కాళ్ల దగ్గరి కొచ్చింది. వేరే కట్న మేమీ లేకుండా చేసుకుంటా మంటున్నారు. ఈ రోజుల్లో ఒక్క ఆడపిల్ల పెళ్లి చెయ్యటం ఎంత కష్టమో అనుభవిస్తున్న మాకు తెలుసు. నిన్ను బ్రతిమాలుతున్నానురా! కావాలంటే నీ కాళ్లు పట్టుకుంటాను. మేమూ పెద్దవాళ్లమై పోతున్నాం. ఎప్పుడు రాలిపోతామో తెలియదు. మా కోసం ఈ ఒక్క త్యాగం చెయ్యరా!" అని ఏడ్చింది అమ్మ.

"మీరు నన్నిలా వేధిస్తే నేను ఆత్మహత్య చేసుకుంటాను!" అన్నాడు పేర్రాజు.

అమ్మ పెరట్లోకి వెళ్లింది నూతిలో పడతానని.

వద్దు వద్దని వెంటబడి తీసుకొచ్చాడు పేర్రాజు. "ఇప్పుడు నాకు ఉద్యోగంలేదుగదా, ఎలా పెళ్లిచేసుకోను?" అన్నాడు.

"ఉద్యోగ ప్రయత్నం నేను చేస్తాను. ఉద్యోగం దొరికే వరకూ అమ్మాయిని నా దగ్గరే పెట్టుకుంటాను!" అన్నాడు పిల్ల తండ్రి.

పేర్రాజు ఓ క్షణం తటపటాయించాడు.

అతని అంతరాత్మ ఘోషించింది. 'ఆఖరికి నువ్వూ లోకంలోని అందరు



అసమర్థుల్లో కలిసి పోతావా? ప్రేమించి పెళ్ళాట్టం ఇహ నీ వల్ల కావట్టేనా?' అని నిలబెట్టి అడిగింది.

పేర్రాజులోని హీరో లేచి కూర్చున్నాడు. "పిల్లేదు, నాకీ సంబంధం ఇష్టంలేదు. నేను చేసుకోను" అన్నాడు.

"అంతేనా?"

"అంతే! ముమ్మాటికీ అంతే!"

"అయితే నా ఇంట్లోంచి వెళి పో!"

"వెళ్ళిపోతాను, పోక ఇక్కడుండను. కాస్త ఉద్యోగం రానీ, ఇహ మీరు నా మొహం చూడరు."

"నీ మొహానికి ఉద్యోగం వచ్చేదో, చచ్చేదో? అందాకా నిన్నెవడు భరిస్తాడు? నా వల్ల కాదు. ఈ క్షణమే బయటికి నడు!"

"కని పెంచినందుకు భరించవలసిందే! ఎవరికోసం?" అని గొణుక్కున్నాడు పేర్రాజు.

మళ్ళీ మామూలే!

దరఖాస్తులూ, ఇంటర్వ్యూలూ.

ఇంటర్వ్యూ కెళ్ళాలి, ఏభై రూపాయ లిమ్మన్నాడు పేర్రాజొరోజు.

నా దగ్గర డబ్బు లేదు, నీకూ నాకూ సంబంధమూ లేదు పొమ్మన్నాడు నాన్న.

"ఊరికే ఆవేశపడకు, నాన్నా! ఏభై ఏళ్ల క్రితం పుట్టిన నీకు ఇప్పటి పరిస్థితు లర్థంకావు. ఆ రోజుల్లో నువ్వెలా ఉన్నా, ఏం చేసినా చెల్లింది. కాని, ఈ రోజుల్లో అలా కాదు. తలిదండ్రులు కుదిర్చిన సంబంధమే చేసుకున్న వాణ్ణి వట్టి చేతగాని దద్దమ్మగా చూస్తుంది ప్రపంచం. వాడికి కాస్త గౌరవం కూడా ఇవ్వదు. చదువుకోని అమ్మాయిల్ని చేసుకోవడం, వాళ్ళని వంటింట్లోనే పాతెయ్యటం మీ రోజుల్లో బాగానే ఉండేది. కాని, ఇప్పుడు బాగుండదు. మీవన్నీ సంకుచిత భావాలు. ఈ రోజుల్లో కాస్త విశాల హృదయం కావాలి. ప్రపంచం రోజురోజుకీ ఎంత ముందుకు పోతోందో నీకు తెలియదు. చదువుకున్న అమ్మాయిని చేసుకుంటేనే గౌరవం! పెళ్ళాంచేత ఉద్యోగం చేయిస్తేనే గౌరవం! ఆ పెళ్ళాంతో షికార్లు కొడితేనే గౌరవం! నలుగురికీ పరిచయం చేస్తేనే గౌరవం! ..."

"అవ్వ, అవ్వ" అని నోరు నొక్కుకుని ఏడ్చుకుంటూ వంటింట్లోకి వెళ్ళిపోయింది అమ్మ.

పేర్రాజు కొనసాగించాడు: "మీ ఊహలూ, ఉద్దేశాలూ మీ రోజుల్లో సవ్యమైనవే! కాని, అవే ఈ రోజుల్లో చాదస్తపు టూహలుగా భావించబడతాయి. సరే! ఈ విషయాలు నీతో నేను వాదించను. నాకు కావలసింది ఇంటర్వ్యూ కెళ్ళటానికి డబ్బు! ఒక్క ఏభై రూపాయలు ఇచ్చేయ్! ఈ సారి ఖాళీలు కూడా ఎక్కువగానే ఉన్నాయని విన్నాను. మంచి కంపెనీ! నాకీ ఉద్యోగం రావటం గారంటీ! పోనీ, అప్పుగా ఇవ్వు. ప్రోనోటు రాసిస్తాను. నా మొదటి జీతం నుంచి నీ బాకీ నీకు వడ్డీతో సహా తీర్చివేస్తాను..."

జవాబు చెప్పకుండా ఖాండ్రించి వట్టింట ఉమ్మేసి వెళ్లిపోయాడు నాన్న.

అమ్మ వంటింట్లోనుంచి కళ్ళొత్తుకుంటూ వచ్చి, "నీ ఇష్టం వచ్చినట్టే కానియ్, నాయనా! ఏభై రూపాయలు నే నిస్తా పట్టుకెళ్ళు. మీ నాన్నని విసిగించకు" అని ఏభై రూపాయలు చేతిలో పెట్టింది.

ఇంటర్వ్యూకి బయలుదేరాడు పేర్రాజు.

ఈ ఒక్క ఉద్యోగం దొరికిపోయిందంటే ఇహ తను అమ్మ, నాన్నల మీద ఆధారపడి ఉండక్కర్లేదు. తన కిష్టమొచ్చిన అమ్మాయిని ప్రేమించెయ్యొచ్చు, పెళ్ళాడెయ్యొచ్చు. తనని కాదనే దమ్ములిం కెవరికీ ఉండవు.

రైలెక్కి బెర్తుమీద దుప్పటి పరిచాడు పేర్రాజు.

ఎదురు బెర్తు మీద ఓ అమ్మాయి పడుకుని మాగజీన్ చదువుతూంది. ఈ అమ్మాయిని తన కోసమే దేవుడు పంపించాడు గాబోలు ననుకున్నాడు పేర్రాజు.

తనకు తెలిసిన ప్రేమ కథలన్నీ నెమరుకు తెచ్చుకున్నాడు ఏ పద్ధతిలో మొదలు పెట్టాలో ఆలోచిస్తూ.

ఆఖరికి ఓ నిర్ణయాని కొచ్చి చిరునవ్వుతో "మీ మేగజిన్ ఓ సారి ఇస్తారా?" అన్నాడు.

మాట్లాడకుండా ఇచ్చి ఊరుకుందా అమ్మాయి.

ఓ నిమిషం తరవాత "నా దగ్గర పత్రికుంది చూస్తారా?" అన్నాడు, పత్రిక అందిస్తూ.

మాటాడకుండా అందుకుని నాలుగు పేజీలు అటూ, ఇటూ తిరగేసి పక్కన పెట్టేసిం దా అమ్మాయి.

ఆ అమ్మాయి ఇచ్చిన మాగజీన్‌లో బొమ్మలు బాగున్నాయి కాని, రాతలు ఆట్టే అర్థం కాలేదు పేర్రాజుకి. 'ఈ అమ్మాయి బాగా చదువుకుందల్లే ఉంది. ప్రేమిస్తే ఇలాంటమ్మాయినే ప్రేమించాలి, పెళ్ళాడాలి, అందరూ అసూయతో పడి పడి ఛస్తారు' అనుకున్నాడు.

ఆ మేగజీన్ మూసేసి, "మీ రెందాకా?" అన్నాడు.

"మద్రాసు" అం దా అమ్మాయి.

"నేనూ మద్రాసే!" అన్నాడు పేర్రాజు.

ఆ అమ్మాయి ఏమీ విననట్లుగా ఊరుకుంది.

తను ఇంకాస్త చొరవ తీసుకుంటే గాని లాభం లేదనుకున్నాడు పేర్రాజు. కాసేపు ఆలోచించాడు. "మీకు పెళ్ళయిందా?" అని ఎదురుబడి అడిగెయ్యటం ప్రమాదం. ఆ అమ్మాయికి మెళ్ళో మంగళసూత్రం ఉందో లేదో కనిపించటం లేదు.

"మీకు డాక్టరు రాజారావు తెలుసా?" అన్నాడు.

తెల్లమొహం వేసి, "ఎవరా రాజారావు?" అంది.

"ఓ! క్షమించండి! ఆయన మా ఫ్రెండుకి ఫ్రెండు. ఆయన భార్యని చూస్తే మీరే జ్ఞాపకం వస్తారు — సారీ, మిమ్మల్ని చూస్తుంటే ఆవిడే జ్ఞాపకం వస్తున్నారు. అందుకని ..." అని కోసేశాడు.

"ఓ! నా కింకా పెళ్ళే కాలేదు!" అం దా అమ్మాయి.

కావలసిన సమాధానం వచ్చింది. 'అమ్మయ్య' అనుకోబోయి, "వెరీగుడ్"! అనేశాడు పేర్రాజు.

---

## మంచు ప్రేమలు

**నా అనుభవంలో చెప్పాలంటే మొదట మనసుపడ్డ వ్యక్తిని ఇరవై మందిలో ఒక్కరు కూడా పెళ్లి చేసుకోరు. మనం మంచు బొమ్మలు తయారు చేసుకుని, అవి కరిగి పోతుంటే ఏడుస్తాం.**

—వాల్టర్ స్కాట్

---

"ఆఁ!" అన్నట్టు కోపంగా చూసిందా అమ్మాయి.

ఆ కోపం చల్లారటాని కో అయిదు నిమిషాలు టైమిచ్చి, "మీరు పోస్టు గ్రాడ్యుయేటా?" అన్నాడు పేర్రాజు.

"లేదు, వట్టి గ్రాడ్యుయేటునే!"

"నేనూ వట్టి గ్రాడ్యుయేటునే! ఎకనమిక్సు మెయిన్! ఉద్యోగానికి ఇంటర్వ్యూ కెళ్ళుతున్నాను. ఇదుగో, చూడండి, ఇంటర్వ్యూ కార్డు" అని కవరు తీసి చేతి కిచ్చాడు.

చూసి మొహం చిట్లించి తిరిగి చేతి కిచ్చేసిం దా అమ్మాయి. పేర్రాజు నిర్ఘాంతపోయాడు. ఆ అమ్మాయి ఎందుకలా మొహం చిట్లించిందో అర్థం కాలేదు. అదలా ఉంచి తరవాత ఏం మాట్లాడాలో తెలియలేదు.

కాసేపాగి — "ఎస్. టి. సి. ఉద్యోగాలు మంచివేకదండీ!" అనడిగాడు తెలియనట్లు మొహం పెట్టి.

చురచురా చూసి, "మీకు పెళ్ళయిందా?" అనడిగిం దా అమ్మాయి.

షాక్ తిన్నాడు పేర్రాజు!

ఆ అమ్మాయి ఇలా అడుగుతుందని కల్లో కూడా అనుకోలే దతను. అసలా ప్రశ్నలోని అంతరార్థం ఏమిటి? బహుశః ఆమెకి తనమీద మెల్లిగా ఇష్టం కలుగుతూందేమో! అని సంతోషపడి, "ఇంకా కాలే"దంటూ సిగ్గుపడ్డాడు.

"ఇంకా మీ రెవర్నీ ప్రేమించలేదా?"

తన విషయాలన్నీ తెలిసిన ట్లడిగేస్తూంది అమ్మాయి అనుకుని ఆశ్చర్యపోయాడు. "నేను మీకు తెలుసా? మీరు ఫలానా కాలేజీలో చదివారా?" అని ఎదురు ప్రశ్న వేశాడు.

"నేను ఫలానా కాలేజీలో చదవలేదు గాని, మీ సంగతి నాకు బాగా తెలుసు. మీరు చాలా సంబంధాలు తిరగ్గొట్టారని కూడా తెలుసు."

"ఎలా తెలుసు?"

"మా నాన్న చెప్పాడు!"

"మీ నాన్నగారి కెలా తెలుసూ? ఆయన పేరేమిటి?"

"గంగాధరం గారు, గాలోటి!"

బుర్ర తిరిగి పోయింది పేర్రాజుకి. అతను తిరగ్గొట్టిన సంబంధాల్లో అదొకటి! చాలా నొచ్చుకున్నాడు. బాధపడ్డాడు. తనని తనే తిట్టుకున్నాడు. అలా తిరగొట్టినందుకు తన నాలుకని చీలికలు చేసినా తప్పు లేదనుకున్నాడు. అస లలాంటి ఆలోచన వచ్చినందుకు తన బుర్ర దాను కీర్తన పాడటం న్యాయం అనుకున్నాడు. వేళ్లు విరుచుకున్నాడు. గోక్కుంటున్నట్టు నటిస్తూ చెంపలు వాయించుకున్నాడు.

ఇంత వేళాక మళ్లీ తను చేసిన పనిలో తప్పేమీలేదని జ్ఞాపకం వచ్చింది. ప్రేమించిగాని పెళ్లి చేసుకో గూడదన్న ఆశయంకోసం గదా తను ఆ సంబంధం కూడా తిరగ్గొట్టింది!

ఆ సంగతే ఆ అమ్మాయితో చెప్పదలుచుకున్నాడు. కాని ...

ఆ అమ్మాయి అప్పుడే అటు తిరిగి ముసుగు తన్ని నిద్రపోతూంది.

"ఏమండీ!" అని మెల్లిగా పిలిచాడు.

సమాధానం లేదు.

మళ్లీ పిలిచాడు.

ఊఁహూ!

ఎంత పని జరిగిపోయింది? కాస్తలో చేజారిపోయింది. అసలు తను ఇంటర్వ్యూ

కార్డు చూపించకుండా ఉంటే బాగుండేది. ఏం లాభం? అంతా అయిపోయింది. ఛీ ఛీ! నరకంలో పాపుల్ని వేడినూనెలో వేయిస్తారట దొరగా. తనని కూడా ఎవరన్నా అలా వేయిస్తే బాగుణ్ణనుకున్నాడు. తల బుర్రకేసి కొట్టుకున్నాడు. దుప్పటి మీదకు లాక్కుని ముసుగు తన్నాడు.

తెల్లవారింది.

రైలుబండి మద్రాసు సెంట్రల్‌లో ఆగింది. రాత్రంతా నిద్దర్లేదు పేర్రాజుకి. ఎప్పుడు తెల్లవారుతుందా, ఎప్పుడా అమ్మాయితో క్షమాపణలూ, వగైరాలూ చెప్పుకుందామా అని ఆరాటపడిపోతున్నాడు. ఆ అమ్మాయి మాత్రం ఆ రైలు పెట్టెని ఉయ్యాలగా చేసుకుని తెల్లవార్లూ తెగ నిద్రపోయి బండి ఆగిపోగానే లేచి కూర్చుని ఆవలించి ఒళ్ళు విరుచుకుని కళ్ళు నులుముకుని కాళ్ళు పారజాపు క్కూర్చుంది, అందరూ బండి దిగాక తనూ దిగచ్చనే ఉద్దేశంతో కాబోలు.

'గోతికాడ నక్క'లా కాచుక్కూర్చున్న పేర్రాజు చిరునవ్వుతో — "గుడ్ మార్నింగ్! రాత్రంతా బాగానే నిద్ర పట్టినట్టుందే మీకు? కాఫీ తెచ్చి పెట్టమంటారా?" అన్నాడు.

ఓ సారి పేర్రాజు ముఖంలోనికి చూసి మళ్ళీ మొహం అటు తిప్పేసుకుం దా అమ్మాయి, మళ్ళీ ఆవలిస్తూ.

"రాత్రి మీరు మాట్లాడుతూ మాట్లాడుతూనే నిద్రపోయారు!" అన్నాడు పేర్రాజు.

ఆ అమ్మాయి మొహం కూడా ఇటు తిప్పలేదు.

పేర్రాజు ధైర్యం కూడదీసుకుని తను చెప్పదలుచుకున్న మాటల్ని మనసులోనే నాలుగు సార్లు మననం చేసుకుని, "మీకు నా మీద ఇంత కోపం ఎందుకొచ్చిందో నాకు తెలుసు. ఆ సంగతులన్నీ మీతో వివరంగా మాట్లాడాలనుకుంటున్నాను. మీకు వీలైతే ..." అన్నాడు.

అతని వాక్యం పూర్తి కాకుండానే ఓ బట్టతలాయన పెట్టెలో కొచ్చేసి, "ఇందులో ఉన్నావా, తల్లీ? నీకోసం రైలంతా వెతుక్కొస్తున్నాను. సర్లే, రా, దిగు. మా పిన్ని కిందుంది. ఈ బెడ్డింగొక్కటేనా, ఇంకేమన్నా ఉన్నాయా?" అంటూ ఆ అమ్మాయిని చేతి ఆసరాతో కిందికి దించి బెడ్డింగు చుట్టడం మొదలెట్టాడు. అమ్మాయి బయటికి వెళ్ళిపోయింది.

హతాశుడైపోయాడు పేర్రాజు. తన పానకంలో వచ్చిన ఆ పుడకని కసిదీరా తిట్టుకుని తన దుప్పటి కూడా తీసి మడత పెట్టి పెంచీలో పెట్టుకుని రైలు దిగాడు. అప్పటికే ఆ అమ్మాయి వాళ్ళు గేటు దాటి బయటికి వెళ్ళిపోయారు గాబోలు ఎక్కడా కనపడ లేదు.

తను ప్రతిసారీ ప్రేమలో ఫెయిలవుతున్నాడు. 'ఏమిటో దురదృష్టం!' అనుకుంటూ దగ్గర్లో ఉన్న ఓ చిన్న హోటల్లో దిగాడు.

ఆ మధ్యాహ్నమే ఇంటర్వ్యూ.

స్నానం చేసి, భోజనం చేసి హిందూస్తాన్ ఇయర్ బుక్ ఓ సారి తిరగేసి మధ్యాహ్నం మౌంట్ రోడ్డు వెళ్ళిపోయాడు. అక్కడే ఉంది ఎస్. టి. సి. ఆఫీసు.

వెళ్ళగానే మొట్టమొదట పేర్రాజుకే పిలుపొచ్చింది. వెళ్ళి అడిగిన వాటన్నింటికీ తనకి తెలిసినంతవరకూ టకటకా జవాబులు చెప్పాడు. తెలియని వాటికి స్టైల్‌గా "అయాం సారీ, ఐ డోంట్ నో!" అన్నాడు. ఆఫీసర్లు తృప్తిపడ్డట్టే కనిపించారు. "థాంక్యూ! నౌ యూ కెన్ గో!" అన్నారు.

పేర్రాజు బయటి కొచ్చేశాడు అమితానందంతో. ఈ ఉద్యోగం తనకి రాకపోవటాని కేమీ అవకాశాలు లేవు. బతికి బాగుంటే ఈ ఉద్యోగం వచ్చాక ఆఫీసులో మరెవరినైనా ప్రేమించ వచ్చులే అనుకున్నాడు.

అతను బయటికి రాగానే "నెక్స్ట్, మిస్ జి. లలిత!" అని కేకేశాడు గుమ్మంలో లిస్టు ముంద రెట్టుక్కూచున్న గుమాస్తా. అప్పటిదాకా కారిడార్‌లో నిలబడి బయటికి చూస్తున్న అమ్మాయి గిరుక్కున ఇటు తిరిగి చకచకా రావటం మొదలెట్టింది.

ఆ అమ్మాయి ఎవరో కాదు! రాత్రి రైల్లో కలిసిన అమ్మాయే!! పేర్రాజుకి ఆశ్చర్యం, సంతోషం ముంచుకొచ్చేశాయి.

"గుడ్ ఆఫ్టర్నూన్!" అన్నాడు చిర్నవ్వుతో.

ఆ అమ్మాయి — మిస్ జి. లలిత — వినిపించుకోలేదు.

"విష్ యూ బెస్టాఫ్ లక్!" అన్నాడు.

"థాంక్యూ!" అంటూ ఇంటర్వ్యూ రూమ్‌లోకి వెళ్ళిపోయింది లలిత.

పేర్రాజు కాచుక్కూర్చున్నాడు లలిత కోసం. పది నిమిషాల్లో బయటి కొచ్చింది లలిత చిరునవ్వుతో.

పేర్రాజు ఎదురెళ్ళి, "మిమ్మల్నేం అడిగారు? అన్నీ బాగా చెప్పారా?" అన్నాడు.

"ఓ ఎస్" అంది లలిత.

**ప్రేమకు హద్దులు**

పిల్లల భవిష్యత్తు కోసం స్త్రీ తన భర్తను ప్రేమిస్తుంది. భార్యకోసం పురుషుడు తన పిల్లల్ని ప్రేమిస్తాడు.

— షిర్లే

"మీరు కూడా ఇంటర్వ్యూ కొస్తున్నట్టు రాత్రే నాతో ఎందుకు చెప్ప లేదు?" అన్నాడు పేర్రాజు.

"చెపితే ఏం చేసేవారు?" అనడిగింది లలిత.

ఆఁ అవును. ఏం చేసేవాడు? జవాబు దొరకలేదు పేర్రాజుకి. అందుచేత "ఇహిహి!" అన్నాడు. "భలే చమత్కారంగా మాట్లాడతారే మీరు!" అని కూడా అన్నాడు.

"ఊఁ" అని ఓరగా చూసింది లలిత, 'నిజంగానా?' అన్నట్టు.

"నిజంగా! ఒట్టు!" అన్నాడు పేర్రాజు.

లలిత బయటికి నడుస్తుండగా వెంటపడ్డాడు పేర్రాజు. గేటుదాకా వచ్చాక "క్షమించండి! ఓ చిన్న రిక్వెస్ట్! మీ అమూల్యమైన కాలంలో ఒకే ఒక అరగంట నాకు కేటాయించారంటే నా చరిత్ర అంతా మీ ముందు పెడతాను. ఆపైన మీరు నన్నెలా చూసినా నా కిష్టమే! మీకు నాపై ఏర్పడ్డ దురభిప్రాయాన్ని తొలగించటం నా కర్తవ్యం. నా కీ చిన్న అవకాశం మాత్రం ఇవ్వండి. ఆ తరవాత మీ దారి మీది, నా దారి నాది!" అన్నాడు.

తెల్లబోయి చూస్తూ, "ఏమిటి మీ రనేది? మీపై నాకు ఏమభిప్రాయం ఏర్పడిందని? అసలు మనిద్దరికీ సంబంధం ఏమిటి?" అంది లలిత.

"నిజమే! ఇంతవరకూ మీకూ నాకూ చెప్పుకోదగ్గ సంబంధమేమీ లేదు. నన్ను గురించి అనేకులు అనేక రకాలుగా అనుకోవచ్చు. నేను వాటన్నిటినీ లెక్క చెయ్యను. అజ్ఞానులు, విలువలేని మనుషులు ఎన్నైనా అనుకుంటారు. వాళ్ళ అభిప్రాయం సరిదిద్దాలని నేను ప్రయత్నించను. కాని, ఒక మంచి మనిషి, చదువుకున్న మనిషి, మంచికీ చెడుకీ వ్యత్యాసం గ్రహించగల మనిషి నన్ను అపార్థం చేసుకుంటే బాధపడతాను. ఆ దురభిప్రాయం తొలగించాలని ప్రయత్నిస్తాను. నన్నర్థం చేసుకోమని ప్రార్థిస్తాను. అంతకంటే నేను మరేమీ ఆశించను ఆ మనిషి నుంచి. నా గోడు మీరు అర్థం చేసుకోగలరని నా నమ్మకం. అందుకే మిమ్మల్నింతగా ప్రాధేయపడి అడుగుతున్నాను..."

"సరే! ఇంతకీ ఏమి టసలు సంగతి— చెప్పండి!"

"అలా హోటలు కెళ్ళి కాఫీ తాగుతూ మాట్లాడుకుందాం, రండి! ప్లీజ్!"

ఇద్దరూ హోటల్ గేలార్డుకి నడిచారు.

అక్కడ రెండు కాఫీల కార్డరిచ్చి తన కథఅంతా వెళ్ళబోసుకున్నాడు పేర్రాజు. తను పల్లెటూళ్ళో పుట్టి పెరిగినా కాలేజీ చదువుకోసం బస్తీ రావటం చేత ప్రపంచమంటే ఏమిటో, జీవితమంటే ఏమిటో తెలుసుకో గలిగా నన్నాడు. తన జీవితాని కో ఆశయం ఏర్పరుచుకున్నా నన్నాడు. అది ప్రేమించకుండా పెళ్ళి చేసుకోకపోవటమే నన్నాడు. ఆ ఆశయమే తనచేత గారోటి వారి సంబంధంతో సహా అన్ని సంబంధాల్నీ తిరగ్గొట్టేట్టు చేసిం దన్నాడు. ఇహ మీ ఇష్టం అన్నాడు.

అంతా వినేసి "ఇహ వెళదామా?" అంది లలిత.

"మీ రింకా ఏ సంగతి నాతో చెప్పనే లేదు!" అన్నాడు పేర్రాజు.

"ఏం చెప్పాలి?"

"నే చేసిన పనిలో తప్పేమైనా ఉందా?"

"లేదనుకోండి ..."

"నా తృప్తికోసం మీ రా మాట అనద్దు!"

"నిజంగానే! మీరు చెప్పిందంతా నిజమే అయితే, మీరు చేసింది తప్పు కాదు."

"అమ్మయ్య! నాకు తెలుసు మీరు నన్నర్థం చేసుకోగలరని. అందుకే నా కథఅంతా మీతో చెప్పాను. మీరు నాకు నచ్చారు. నేను మీకు నచ్చానా?"

ఏమిటి నీ ఉద్దేశం?—అన్నట్లు చూసింది లలిత.

"నన్ను మళ్ళీ మీ రపార్థం చేసుకోకండి. నేను ప్రేమించబడదగిన వ్యక్తి నేనా? అని అడుగుతున్నాను."

లలిత పకపకా నవ్వి, "సరే, ఇహ వెళదాం, పదండి. మీరు కథలూ గట్రా రాస్తూంటా రేమిటి?" అంది, ఆ పైత్యం నీకూ ఉందా అనడిగే ధోరణిలో.

"నేను కథలు రాసేటంతటి వాణ్ణి కాకపోయినా, ఓ మనిషిలో మంచితనం చూసినప్పుడు నాకు పిచ్చెక్కుతుంది. ఆ మాట నిజమే! మీకుమాత్రం?"

"ఇంకాసేపు మీతో ఇలాగే మాట్లాడితే నాకూ పిచ్చెక్కుతుందేమో నని భయం వేస్తోంది..."

"అంటే, నేను మీకునచ్చినట్టేనా?"

"ఏమిటి పదే పదే వేస్తున్నా రా ప్రశ్న?"

"సూటిగా చెప్పమంటారా? నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. మీరు సరే నంటే మన పెద్దల ఆశీర్వాదంతో పెళ్లి చేసేసుకుందాం. పాత సంబంధమేగా వని వాళ్లూ సంతోషిస్తారు..."

లలిత ఏం మాట్లాడలేదు.

బిల్లు చెల్లించి ఇద్దరూ బయటి కొచ్చారు.

పేర్రాజు మళ్లీ మొదలెట్టాడు.

"నా మీద మీకు ఏ విధమైన సందేహాలున్నా ఇప్పుడే అడిగెయ్యండి. దాచకుండా నా మనసులో ఉన్నవన్నీ చెప్పేస్తాను. మా అమ్మా, నాన్నా పాత కాలం వాళ్లయినా నేను పూర్తిగా ఈ కాలం మనిషిని. అలా అని తప్పటడుగులు వేసి తప్పించుకునే వాణ్ణి కాను. స్త్రీ పురుష సమానత్వం మీద గట్టి నమ్మకం కలవాణ్ణి. నేను నన్నెంత గౌరవించుకుంటానో నా భార్యనీ అంత గౌరవించుకుంటాను. మళ్లీ మాట్లాడితే అంతకంటే ఎక్కువ గౌరవించుకుంటాను. పువ్వుల్లో పెట్టి పూజించుకుంటాను. నెత్తినెక్కించుకుని ఊరేగమన్నా ఊరేగుతాను. ఇంకా ఏం చెప్పమంటారు?"

"మీ మాటలు చాలా దూరం వెళుతున్నాయి. అవన్నీ నమ్మమంటారా నన్ను?"

"పోనీ, ఏం చేస్తే నమ్మగలరో చెప్పండి — ఇప్పుడే చేసి చూపెడతాను!"

"మీకు మీ పెళ్లాం మీద ఎంత ప్రేమయినా ఆవిణ్ణి నెత్తి నెక్కించుకు తిరిగితే లోకం నవ్విపోతుందని మీకు భయంలేదా?"

"నేను లోకాన్ని లక్ష్యపెట్టేవాడినైతే మా తలిదండ్రుల మాట విని ఎప్పుడో పెళ్లి చేసుకునుండేవాణ్ణి."

లలిత ఏం మాట్లాడలేదు.

"ఇంకా ఏమిటి మీ సందేహం?"

"మీ భార్య ఉద్యోగం చేస్తే మీ కభ్యంతరం లేదా?"

"అభ్యంతరమా? ఉద్యోగం చెయ్యాలని నా సిద్ధాంతం!"

"మీ తల్లిదండ్రులకిష్టంలేకపోతే?"

"నేను వేరు, వాళ్లు వేరు?"

"మీ భార్య ఉద్యోగం చేస్తూ కూర్చుంటే ఇంటిపను లెవరు చేస్తారు?"

"ఇంట్లో ఉన్నప్పుడే ఇద్దరం చేసుకుంటాం!"

"మీరు ఆడ పనులు చేస్తారా? అంటే, వంట చెయ్యటం, బట్టలుతకటం వగైరాల్లాంటివి — అవసరం వస్తే?"

---

**కలలు**

**భావాలకు, స్వప్నాలకు తేడా లేదు. ఆచరణలో పెట్టని ఆలోచనలు కరిగిపోయిన కలలతో సమానం.**

**—షేక్స్పియర్**

---

"తప్పకుండా చేస్తాను. అంతేకాదు, ఆవిడచేత మగ పనులుకూడా చేయిస్తాను. ఒక్క మాట చెప్పమంటారా? ఆ మధ్య నెవరో అన్నట్టు సంసార మనే రథానికి మగ, ఆడ అనేవి రెండు చక్రాలు! సమానమైనవి. ఒక రెక్కువ, ఒకరు తక్కువ అనుకోవడం చాలా తప్పు. అలా అనుకుంటే ఆ రథం బోల్తాపడుతుంది. కాదంటారా?"

"అనునుగానీ, అందులో ఒక చక్రం ఎప్పుడైనా పెద్దదై పోతే?"

"ఎలా అవుతుంది?"

"మీరు క్రమంగా హెన్ పెక్డ్ అయిపోతే? కళ్లు నెత్తికెక్కి నేను మీ మీద అధికారం చెలాయించబోతే?"

ఇంతసేపూ 'మీ భార్య' అంటూ ఇప్పుడు 'నేను' అనటం గమనించాడు పేర్రాజు. అతని ఆనందం కట్టలు తెంచుకు ప్రవహించింది. "సంతోషిస్తాను. పరమానందభరితుణ్ణవుతాను. గర్వపడతాను. ఈ మాటలు మనఃస్ఫూర్తిగా అంటున్నాను!" అన్నాడు.

అతని కళ్లలో నీళ్లు నిలవటం లలిత గమనించింది. చూడలేక మొహం అటు తిప్పుకుంది.

"ఇంకేమన్నా ఉన్నాయా మీ సందేహాలు?" గద్గదస్వరంతో అన్నాడు పేర్రాజు.

లలితకి జాలి పుట్టుకొచ్చింది. "మీకు లోకం అంటే నిజంగా భయం లేదా?" అనడిగింది.

"లోకాన్ని లక్ష్యపెట్టే వాణ్ణి కాదని ఇందాకే చెప్పాను!" జేబు రుమాలుతో కళ్లు తుడుచుకుంటూ అన్నాడు పేర్రాజు.

లలిత కళ్లు కూడా చెమ్మగిల్లాయి. "ఏమీ అనుకోకండి! ఊరికే మీ మనసు తెలుసుకుందామని అడిగాను. నేను మీమీద అధికారం చెలాయించను లెండి!" అంది చిరునవ్వుతో.

బ్రహ్మానందంతో బ్లడ్ప్రెషర్ వొచ్చేసింది పేర్రాజుకి. లలిత నెత్తుకుని గిరగిరా తిప్పేద్దా మనుకున్నాడు గాని, మౌంట్రోడ్డు మీద లోకు లేమను కుంటారోనని ఆ ఉద్దేశం మానుకున్నాడు. అందుకు బదులుగా — "మీకు అనేక వేల ధన్యవాదాలు. ఇహనైతే ఆలస్యం ఎందుకు? మీ రొక్క పని చెయ్యండి. మీ నాన్నగారి నొచ్చి మా నాన్నగారితో ఒక్క మాట మాట్లాడమనండి, జస్ట్ ఫార్మాలిటీకోసం!"

ఛర్రుమంది లలిత. "మళ్లీనా? ఒకసారి తిరగ్గొట్టిన తరవాత మళ్లీ ఏ మొహంతో వెళ్లమంటారు మా నాన్నని మీ నాన్నగారి దగ్గరికి?" అంది.

"సరే సరే, వద్దు వద్దు. అదంతా నే చూసుకుంటాలెండి. మీ అడ్రెసివ్వండి కాస్త!" అనడిగాడు పేర్రాజు.

ఇచ్చింది లలిత.

పేర్రాజు మద్రాసునుంచి ఇంటికొచ్చేశాడు, చేటంత మొహం చేసుకొని. రాగానే వేణుగోపాలస్వామి గుళ్లో ఓ కొబ్బరికాయ కొట్టేశాడు.

"ఉద్యోగం వచ్చిందా, నాయనా?" అనడిగింది అమ్మ.

"వస్తుంది తప్పకుండా!" అన్నాడు పేర్రాజు.

నాన్న ఏమీ అడగలేదు. ఏమీ పట్టించుకోనేలే దసలు.

సమయం చూసి అమ్మతో పేర్రాజు చెప్పేశాడు, తను ఫలానా గారోటి వారి సంబంధం చేసుకో దలుచుకున్నట్టు. బోలెడంత సంబరపడిపోయింది అమ్మ. "పోనీలే! ఇన్నాళ్ల కసలు పెళ్లి చేసుకుంటా నన్నా వంతే చాలు!" అని ఆ రాత్రే ఈ చల్లని కబురు నాన్న చెవిలో వేసింది. విని ఏమీ అనకుండా ఊరుకున్నా డాయన.

మరునాడు మళ్లీ జ్ఞాపకం చేసింది అమ్మ.

"వాడు పెళ్లి చేసుకుంటే నాకేం? పెద్ద కృష్ణలో దూకితే నాకేం?" అన్నాడు నాన్న.

అనేక విధాల నచ్చచెప్పింది అమ్మ.

ఆఖరికి "ఊఁ, సరే. జాతకం తెప్పించమను, చూద్దాం!" అన్నాడు నాన్న.

ఆ మరునాడు "జాతకం పంపమని నాన్నే ఆయనకు ఉత్తరం రాస్తే బాగుంటుందేమో!" అన్నాడు పేర్రాజు.

ఆ రాత్రి "ఛ ఛ! నేనెందుకురాస్తాను ఉత్తరం, మగపెళ్లివాళ్లం?" అన్నాడు నాన్న.

ఆ మరునాడు పేర్రాజే స్వయంగా ఉత్తరం రాశాడు గారోటి గంగాధరం గారికి — "నేను మీ అమ్మాయిని పెళ్లాడ దలుచుకున్నాను. ఇదివరకు మీ సంబంధం తిరగ్గొట్టినందుకు నన్ను క్షమించండి. ఆ వివరాలన్నీ మీ అమ్మాయికి తెలుసు. ఇప్పుడు మే మిద్దరం ప్రేమించుకున్నాం. ఈ సంగతి మీకూ సంతోషం కలిగిస్తుందని నా నమ్మకం. అమ్మాయి జాతకం పంపమన్నాడు మా నాన్న. వెంటనే పంపగలరు" అని.

వారం రోజుల తరవాత ఓ కవర్లో జాతకం వచ్చింది. అందులో వేరే ఉత్తరం ఏమీ లేదు.

జాతకాలు కలవటం సంగతెలా ఉన్నా, ముందు అబ్బాయికంటె అమ్మాయి ఆరు నెలలు పెద్దదని తేలింది.

"ఛ ఛ, వల్లకాదు. వరహీనం, తీసి పారెయ్య" మన్నాడు నాన్న.

గతుక్కుమన్నాడు పేర్రాజు.

ప్రేమించక ప్రేమించక ఒక్క అమ్మాయిని ప్రేమిస్తే — అది వరహీనంట! తలుచుకుంటే తను 'నీ లెక్కేమిటి?' అని వెళ్లిపోయి రిజిస్టర్ మేరేజి చేసుకోగలడు.

"పాత సంబంధమే కద, నాన్నా! ఇదివరకే నేను ఒప్పుకుని ఉంటే ఈ పెళ్లి చేసి ఉండేవాడివి కాదా?" అని బుజ్జగించబోయాడు పేర్రాజు.

"ఎలా చేస్తాను? అసలు జాతకాలు చూసుకునేదాకా నువ్వు రానిస్తే గదా! ముందే నీ బోడి లెక్చర్లతో వాళ్లని తిరగ్గొట్టి పంపేశావయ్యె! బోడిలెక్చర్లు! బోడి లెక్చర్లనీ!"

"ఈ రోజుల్లో ఇలాంటి చిన్న విషయాలు పట్టించుకో గూడదు, నాన్నా!"

"ఏడిశావులే! చిన్న విషయాలట, చిన్న విషయాలు! కావాలంటే ఆ అమ్మాయి కో చెల్లెలుందిగాబోలు, ఆ అమ్మాయిని చేసుకుంటానని చెప్పు. అంతేగాని, ఇలాంటి వరహీనం సంబంధాలు..."

పేర్రాజుకి కోపం వచ్చేసింది. "వరహీనం లేదు, వాక్కాయ లేదు. మనసులు కలవటం ముఖ్యం!" అన్నాడు.

కలిస్తే వెళ్లి నూతిలో దూకమన్నాడు నాన్న.

అలాగే దూకుతా నన్నాడు పేర్రాజు.

నెల రోజులు తిరక్కుండా అపాయింట్మెంటు ఆర్డరు వచ్చింది పేర్రాజుకి.

పెట్టె బేడా సర్దుకుని, "వెళ్లొస్తాను, నాన్నా! ఇన్నాళ్లూ నువ్వు నన్ను భరించినందుకు కృతజ్ఞుణ్ణి. బ్రతికి బాగుంటే నీ ఋణం తీర్చుకుంటా నెప్పటికైనా!" అన్నాడు పేర్రాజు.

"నువ్వేం తీర్చుకో నక్కర్లేదులే! నీ శని విరగడైపోతే చాలు!" అన్నాడు నాన్న.

"ఏదైనా సర్దుకుపోవచ్చుగాని, వరహీనం సంబంధాలు చేసుకోకూడదు. నాయనా! చిన్నతనం, నీకు తెలియదు. నువ్వు మీ నాన్న మాటలకేం బాధ

చెంపలు వేసుకుని కాపాడ మన్నాడు.

"ఏమిటి, నాయనా, ఏమైందిరా?" అంటూ కంగారుపడింది అమ్మ.

ఏడుపులూ, పెడబొబ్బలూ ఆయ్యాక జరిగిన కథఅంతా చెప్పాడు పేర్రాజు.

అంతా విని, "ఇప్పుడు మమ్మల్నేం చెయ్యమంటావురా?" అంది అమ్మ.

"ఆ డాక్టరుగారి సంబంధం మీరు వదిలేస్తే నా పరువు నిలుస్తుందమ్మా!" అన్నాడు పేర్రాజు దీనంగా.

"ఛండాలపు వెధవా! ఇందుకా మళ్ళీ ఇక్కడికి దాపురించావ్? ఆనాడు నీ చెల్లెలికి సంబంధం వెతకటం నీకు పరువు నష్టమైందా? ఈ నాడు వచ్చి చెడి నేనో సంబంధం వెతుక్కొస్తే దాన్ని కాస్తా చెడగొట్టాలని చూస్తున్నావా? నిన్ను నరికి పోగులు పెట్టినా పాపం లేదు!" అంటూ మూలనున్న కర్ర తీసుకున్నాడు నాన్న.

"వద్దు, నాన్నా! కొట్టద్దు నాన్నా! ఆనాడు ఒళ్లు తెలియకుండా ఏమేమో వాగాను, కాని, ఇప్పుడు తెలిసొచ్చింది, నాన్నా! నన్ను క్షమించి గట్టెక్కించు, నాన్నా..."

"పెద్ద విశాల హృదయుడివిగా మన్నా! దీన్ని కష్టంగా భావించగూడదు. సంతోషంగా అనుభవించాలి. వెళ్ళు, వెళ్ళు!"

"కాదు, నాన్నా! పొరపడ్డాను, నాన్నా! నా దంత విశాల హృదయం కాదని ఇప్పు డర్థమైంది, నాన్నా!"

"కాకపోతే ఇప్పుడు విశాలం చేసుకోవోయ్!"

"చచ్చిన పాముని ఇంకెందుకు చంపుతావు, నాన్నా? క్షమించి రక్షించు, నాన్నా! వచ్చే జన్మలో కూడా నీ కడుపునే పుడతా, నాన్నా!"

"ఇంకానా? వద్దు, బాబ్బు! వెయ్యి జన్మలకీ వద్దు! నా తల కొరివెట్టటానికి పంచాయతీ వా ళ్లున్నార్లే! ముందు బయటికి నడు!"

"అలా అనకు, నాన్నా! 'అపుత్రస్య గతిర్నాస్తి' అన్నారు పెద్దలు ..."

"నీ దుంచు మొహానికి తోడు సంస్కృతం కూడానా. ఛండాలుడా!" అంటూ త్రాచుపాములా లేచాడు నాన్న.

అమ్మ అడ్డొచ్చి, "చిన్న పన్నాసి వెందు కట్టా చీదరించుకుంటారు? ఎంతైనా కన్న కొడుకు! ఒక్కగా నొక్క మగబిడ్డ! తెలియ కేదో చేశాడు— అయిపోయింది. పాత గొడవలన్నీ మరిచి పోయి కాస్త వాడితో మంచిగా మాట్లాడండి, రాక రాక ఇంటి కొచ్చాడు, పాపం!" అంది.

ప్రతిమాలగా, ప్రతిమాలగా ఎప్పటికో ఛల్లబడ్డాడు నాన్న.

"డాక్టరుగారి సంబంధం ఖాయం చేసేసుకున్నాం. ఇహ దాన్ని గురించి మాట్లాడ్డానికి వీల్లేదు. కావాలంటే నరసింహంగారి అమ్మాయి కోసం సంబంధం వెతుకు మన్నావు!" అన్నాడు నాన్న.

"నాకు చేతగాదు — మీరే వెతుకు, నాన్నా! నేను డబ్బిస్తాను!" అన్నాడు పేర్రాజు, ప్రతిమాలుతూ.

"అన్నీ ఏడ్చావులే, నోర్ముయ్! ఎలా వెతకాలో నేను చెబుతాను! అ ప్రకారం చెయ్యి!" అని పేర్రాజును దగ్గర కూర్చో బెట్టుకుని, సంబంధాలు ఎలా వెదకాలో, ముందు ఎవర్నెవర్ని పట్టుకోవాలో, వాళ్లతో ఎలా మాట్లాడాలో, ఏం మాట్లాడాలో, ఏం మాట్లాడకూడదో— అన్నీ వివరంగా చెప్పాడు నాన్న.

అన్నీ మనసులో పెట్టుకుని దేశం మీద పడ్డాడు పేర్రాజు. ఊళ్లన్నీ చెడ తిరిగాడు. పెళ్లి కావలసిన అబ్బాయిలు ఎక్కడెక్క డున్నారో, వాళ్లకి సంబంధించిన వివరా లేమిటో—అన్నీ నోటు బుక్కులో రాసుకుంటూ తిరిగాడు. సందర్భవశాత్తూ తనకి పనికిరాని సంబంధాలు ఇంకెవరికైనా పనికొచ్చేట్టు కనిపిస్తే, వాళ్లకి ఫలానా చోట ఫలానా సంబంధం ఉన్నట్టు తెలియపరిచి పుణ్యం కట్టుకున్నాడు. ఆ విధంగా నాలు గైదు సంబంధాలు బలపడి పెళ్లిళ్ళు కూడా జరిగాయి. కన్యాదాతలు బహు సంబరపడిపోయి పెళ్లిళ్లలో పేర్రాజుకి కూడా బట్టలు పెట్టారు. ఒకాయన వందరూపాయ లిచ్చి, "ఏదో ఉడతా భక్తి!" అని ఆనంద బాష్పాలు తుడుచుకున్నాడు. ఇంకొకాయన మాట వరహో ల్లిచ్చి గట్టిగా కౌగిలించుకున్నాడు పేర్రాజుని.

అయిదునెలల ప్రివిలేజ్ లీవూ, అయిదు వందల రూపాయలూ పూర్తిగా ఖర్చు పెట్టి, ఆఖరి కో సంబంధం వెతుక్కొచ్చి నరసింహంగా రమ్మాయి పెళ్లి కూడా జరిపించాడు పేర్రాజు.

నాలుగైదు రోజుల తరవాత వెళ్లి నరసింహంగారికి కనపడి చేతులు కట్టుకు నిలబడ్డాడు పేర్రాజు, 'నా మాట నిలబెట్టుకున్నాను, ఇహ మీదే ఆలస్యం' అనే ధోరణిలో.

నరసింహంగా రో చిరునవ్వు నవ్వి, "నేను రిటైరై పోతానని మొన్ననే జనరల్ మానేజరు గారితో అన్నాను. అందు కాయన కోప్పడి— "వీల్లేదు, మళ్లీ మాట్లాడితే నా సర్వీసింకా నాలుగేళ్ళు పొడిగిద్దా మనుకుంటున్నా నన్నారు. నే నేం చెయ్యను? నువ్వు గనక ఆయన్ని కాస్త ఒప్పించగలిగావంటే ఇప్పుడే రాసి ఇస్తాను రెజిగ్నేషన్ లెటర్!" అన్నారు.

ఒళ్లు మండిపోయింది పేర్రాజుకి! తన కిహ దారిలేదు. జనరల్ మానేజరు గారిని ఏ విషయంలోనూ ఒప్పించడం ఎవరి తరమూ కాదని ప్రతీతి! మొహం చాటేసుకు తిరగటానికి తన కింకా సెలవు కూడా లేదు. రేపొద్దున ఉద్యోగంలో జాయిన్ అయి తీరాలి. ఇప్పటికే ఆఫీసులో అందరూ రోజూ తనని తలుచుకుని తన కథ చెప్పుకుంటూ పడీ నవ్వుకుంటున్నారు.

ఆ రాత్రంతా బాగా ఆలోచించి ఆ మరునాడే ఉద్యోగానికి రిజైన్ చేశాడు పేర్రాజు. ఆ చేత్తోనే ఇంటి ముందొక బోర్డు కూడా తగిలించాడు, "పి. పేర్రాజు, ఇచ్చట పెళ్లి సంబంధములు కుదర్చబడును" — అని.

"మీ రిలాంటి పనులు చేస్తే లోకు లేమనుకుంటారు? నా పరువేం కావాలి? ఆ నాడు మీ రిచ్చిన లెక్చర్లన్నీ ఏమయ్యాయి? మీ విశాల హృదయం ఏమైపోయింది?" అని మొత్తుకుంది లలిత.

"మ వ్వనుకున్నా నాది విశాల హృదయమే! మరీ ను వ్వనుకున్నంత విశాలం కాదు గాని" అంటూ బయటికి వెళ్లిపోయాడు పేర్రాజు, పనిమీద. ★

# వెన్నెల వ్యథ

## గుంటూరు శేషేంద్ర శర్మ

వసంత కలువల నిడిచి
రాత్రి స్వప్నంగా వెన్నెట్లో స్నానం చేస్తూంది;
పూల పెదాల్లో గాలి గుసగుసలాడుతూంది;
నీవు వస్తానన్న నిరీక్షామధువు చప్పరిస్తూ
ఎద మత్తులో ఒత్తిగిల్లింది;
కల కొరిపోయాయేమో అని
కన్నులు ముకుళించాయి, రేకుల్లో
తేనె దాచుకున్న పుండరీకాల్లా—
మల్లెపొదకు తగులుకున్న దేశద్రిమ్మరి చంద్రిక
నీ నెమ్మేని వలువ అని నా చేయి పట్టుకోబోయింది.

*

దూరాన కొండలమీద కురిసిన వెన్నెల దారుల్లో
నీ అడుగులకై పరుగిడినాయి, నా అలసిన చూపులు;
కానీ, ఊడలు విరిసిన మర్రినీడల
చిక్కని చీకట్లలో చిక్కుకున్నా యవి.

*

కాలంతోటే వెన్నెలంతా వ్యయమైపోతే
నీ రాకకి మిగిలిం దేమిటి?
భ్రమ తొలగిన భ్రతుకు
నీరు వదలిన తామరకొలను

*

ఇంద్రధనుస్సులు అలసిగా మొట్టుకున్నావు
చల్లని వెన్నెలవాకల్ల నమకూర్చుకోలేకపోయాను;
మబ్బులు మసమసకాళ్ళగా మలుచుకోబోయి
కంటక పాషాణపథాల్లో
ఒంటరి బాటసారిగా మిగిలాను;

*

కల కొరిపోయిన నేత్రాలు
పక్షులు లేని గూళ్ళలా బావురుమన్నాయి;
గగనంలో వర్తించే తారల సమూహాలమీద
ఉషస్సు అరుణ కిరణాల వల విసరివేసింది. ★